క్లుప్తంగా

రూ. 21.60 లక్షలతో నూతన భవన నిర్మాణం

మేళ్లమర్తిలంక(మోపిదేవి): మేళ్లమర్తిలంక ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్ర (పీఏసీఎస్) భవన నిర్మాణం వేగంగా సాగుతోంది. పీఏసీఎస్ రూ. 21.60 లక్షలతో నూతనంగా భవనం నిర్మిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్‌పర్సన్ రెడ్రౌతు వెంకటరమణ తెలిపారు. ఇప్పటివరకు అద్దె భవనంలో కొనసాగుతోందన్నారు. నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని, త్వరలోనే భవనం ప్రారంభిస్తామని వివరించారు.

నేడు నిడమర్రులో గడప గడపకు మన ప్రభుత్వం

కృత్తివెన్ను: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి కృత్తివెన్ను మండలం నిడమర్రు–1 సచివాలయం పరిధిలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ముగిసిన ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



పెడన: పాతపేటలోని ముత్యాలమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవ పూజలు గురువారంతో ముగిశాయి. ఉదయం గణపతి పూజ, సుదర్శన హోం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు భవానీ శంకర్ దంపతులతో హోమాలు చేయించి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ అన్నసమారాధనను మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వార్డు కౌన్సిలర్ రెహమతున్నీసా ప్రారంభించారు. సుమారు రెండువేల మందికి పైగా భక్తులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వంశపారంపర్య ధర్మకర్తలు తోట పైడేశ్వరరావు, తోట నాగరాజు, ఆలయ అభివృద్ధి, అన్నప్రసాద కమిటీ పాతపేట దేవాంగ భక్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం ఆలయంలో అమ్మవారికి ఉయ్యాల సేవతో వార్షికోత్సవాలు ముగిశాయి.

ఆలయాల వద్ద అన్నసమారాధనలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని గంగానమ్మతల్లి ఆలయాల వద్ద గురువారం అన్నసమారాధనలు నిర్వహించారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి సమీపంలోని సర్కిల్ వద్ద ఉన్న గంగానమ్మతల్లి ఆలయం వద్ద పౌర్ణమి సందర్భంగా అన్నసమారాధన జరిగింది. అలాగే రేవతి సెంటర్‌లోని గంగానమ్మ తల్లి ఆలయం వద్ద కూడా అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఐదుగురికి గాయాలు

పెడన: పాత గొడవల నేపథ్యంలో పట్టణంలోని ఇందిరా కాలనీ చర్చి వద్ద బుధవారం అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డేగల రాజ్యలక్ష్మీ, సేనాపతి సుబ్బారావుల వర్గీయులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఐదుగురికి గాయాలయ్యాయి. బాధితులు మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మచిలీపట్నం అవుట్ పోలీసుల సమాచారం, రాజ్యలక్ష్మీ, సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పెడన ఎస్‌ఐ రవిచంద్రకుమార్ ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బంటుమిల్లి: పెందుర్రు గ్రామం వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండల పరిధిలోని ములపర్రు పంచాయతీ శివారు రామన్నమోడి గ్రామానికి వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది తీవ్రంగా గాయపడిన బాధితుడిని కుటుంబ సభ్యులు మచిలీపట్నం ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ పైడిబాబు ఘటనా స్థలానికి వెళ్లి సీసీ కెమేరాలు పరిశీలించారు.

ఉరివి గ్రామ సచివాలయ ఉద్యోగులకు నోటీసు

పెడన: మండల పరిధిలోని ఉరివి గ్రామ సచివాలయ ఉద్యోగులు 9 మందికి గురువారం ఎంపీడీఓ వి.రెడ్డయ్య సంజాయిషీ నోటీసు జారీ చేశారు. బుధవారం గ్రామ సచివాలయం మూసి ఉంచడంపై అందిన ఫిర్యాదుతో ఎందుకు మూసి ఉంచారో కారణం మూడు రోజుల్లోగా లిఖిత పూర్వకంగా తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాలను పరిశీలించుకోవాలి

జిల్లా కలెక్టర్ రాజాబాబు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు :



ఎస్‌బీఐ శాఖను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో వీసీ జ్ఞానమణి తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో జరుగుతున్న ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియలో భాగంగా జాబితాలను అన్ని రాజకీయ పార్టీలు విధిగా పరిశీలించుకోవాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో గురువారం మధ్యాహ్నం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియ దాదాపుగా పూర్తికావచ్చిందన్నారు. సంబంధిత అధికారులు ఇంటింటికీ తిరిగి ఆన్‌లైన్‌లో బీఎల్‌ఓ యాప్ ద్వారా పరిశీలించి కచ్చితమైన ఓటర్ల జాబితా తయారు చేస్తారని చెప్పారు. జిల్లాలో 99.73 శాతం పూర్తయ్యిందన్నారు. త్వరలో మిగిలిన సర్వే పూర్తి చేస్తామన్నారు. గతంలో చనిపోయిన వారు, ఒకే వ్యక్తి ఎక్కువ ఓట్లను కలిగిన వారు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్లిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

బూత్‌స్థాయి అధికారులు జాబితా పరిశీలనలో నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములై పక్కాగా జరుగుతున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. పరిశీలనలో గుర్తించిన సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువస్తే ఏమైనా తప్పొప్పులు ఉంటే సరిదిద్దుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, ఈబీసీ నాయకులు పంతం గజేంద్ర, సీపీఎం నాయకులు కొడాలి శర్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడమంచిలి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ పాత్ర కీలకం

కోనేరుసెంటర్: దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ పాత్ర కీలకమని కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆధునికీకరించిన విశ్వవిద్యాలయ శాఖను గురువారం కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. భారత దేశ జనాభాలో 60 శాతం మంది 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గల వారు ఉన్నారని చెప్పారు. వారి మేథోశక్తికి తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్తి స్థాయి బ్యాంకు శాఖగా రూపుదిద్దుకోవడం అభినందనీయమని చెప్పారు. జిల్లాల పునర్విభజన అనంతరం కృష్ణా జిల్లా గణనీయంగా అభివృద్ధి చెందుతోందన్నారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న మచిలీపట్నం పోర్టు పనులకు వేల కోట్ల రూపాయలు కేటాయించి ఇటీవల ముఖ్యమంత్రి ప్రారంభించడం విప్లవాత్మకమైన పరిణామమని అన్నారు. సెప్టెంబర్ మొదటి వారం నుంచి మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యా సంవత్సరం ప్రారంభం కావడం మరో శుభ సూచికమని చెప్పారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో ఉద్యోగ, ఉపాధి ఆధారిత కోర్సులను ప్రారంభించాలని కలెక్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌కు సూచించారు. మచిలీపట్నం పోర్టు ద్వారా అనేకమంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోందన్నారు. పోర్ట్ ట్రాన్స్‌పోర్ట్, ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్, ఆక్వా, మెరైన్ ఎక్స్ పోర్ట్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ తదితర కోర్సులను కృష్ణా విశ్వ విద్యాలయంలో ప్రవేశపెడితే మిగతా యూనివర్సిటీల కన్నా భిన్నంగా ఉంటుందని చెప్పారు. విద్యార్థులు ఆయా కోర్సులను అధ్యయనం చేసేందుకు ఆసక్తి చూపుతారన్నారు. మచిలీపట్నం నుంచి యూనివర్సిటీకి వచ్చే రహదారులకు మహర్దశ పట్టనుందని, ఆయా రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియ టెండర్ల దశలో ఉందని చెప్పారు. త్వరలో యూనివర్సిటీకి మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పడనుందని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధునికమైన బ్యాంకు సేవలను కృష్ణా విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఉద్యోగులతో పాటు పరిసరాల్లోని ఆక్వా రైతులు, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి. జ్ఞానమణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.రామిరెడ్డి, రెక్టర్ ప్రొఫెసర్ డి. సూర్యచంద్రరావు, మచిలీపట్నం తహసీల్దార్ శ్రీవిద్య, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం మనీష్ కుమార్ సింగ్, రీజనల్ మేనేజర్ ఫణిరామ్ కుమార్, మచిలీపట్నం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కె.రామారావు, టి. ఏసుపాదం, మురళీధర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోవాలి

పెడన: పని తీరు తక్షణం మార్చుకోవాలి..ఇలా అయితే ఎలా...మరోసారి ఆలస్యం చేయొద్దంటూ ఎంపీడీఓ వి. రెడ్డయ్య సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. గురువారం ఆయన మండల పరిధిలోని మడక గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఇద్దరు తప్ప ఎవరూ రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అటెండెన్సు రిజిస్టర్లను పరిశీలించడంతో పాటు మూమెంట్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం గ్రాస్ ఎడ్యుకేషన్ రేషియోపై (జీఈఆర్) ఆరా తీశారు. మడక సచివాలయం పరిధిలో బడిఈడు పిల్లలు ఎనిమిది మంది ఉన్నట్లు నివేదికలు రావడంతో వారు ఎక్కడ ఉన్నది తెలుసుకుని పాఠశాలల్లో చేర్పించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ఘనంగా రాఖీ వేడుకలు

కోడూరు: సోదర ప్రేమకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. కోడూరు, చుట్టుపక్కల గ్రామాల్లో అన్నదమ్ములకు అక్కచెల్లెళ్లు రక్షాబంధనం కట్టి ఆశీర్వచనాలు అందుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఈ రాఖీ పండుగను ప్రతి ఇంటా ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

చల్లపల్లి: రాఖీ వేడుకలు గురువారం సందడిగా జరిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అక్కలు, చెల్లెమ్మలు తమ అన్నయ్యలు, తమ్ముళ్లకు రాఖీలు కట్టి ఆశీస్సులు తీసుకున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ఎంఈఓ–2 హరనాథ్



బంగ్లా స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ–2 హరనాథ్

పెడన: విద్యలో వెనుకబడిన విద్యార్థులను ప్రారంభంలోనే గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ–2 వైవీ హరనాథ్ అన్నారు. గురువారం ఎంపీపీ బంగ్లా స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని సముదాయం హెచ్‌ఎంలకు దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సమ్మెటివ్ అసెస్‌మెంట్‌లో ప్రతిభ ఆధారంగా వెనుకబడిన విద్యార్థుల విషయంలో మొదటి నుంచి దృష్టి పెట్టి వారిని కూడా ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. హెచ్‌ఎంలు ఆ దిశగా ఆలోచన చేసి ముందుకు అడుగులు వేయాలని సూచించారు. పెడన మండలంలో పలు పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ శిక్షణలు జరుగుతున్నాయని, శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఆయన మండలంలోని పలు చోట్ల జరుగుతున్న శిక్షణ కార్యక్రమాల పాఠశాలలను సందర్శించారు. పెనుమల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాల, 12వ వార్డులోని ప్రాథమిక (బంగ్లా) పాఠశాల, 5వ వార్డు ఎంపీపీ స్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో బోధించే 55 మంది ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. అదేవిధంగా నందమూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన 50 మంది ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారన్నారు. ఈ శిక్షణలో విద్యార్థులు సాధించిన ప్రగతి, టీచ్ టూల్ బోధనా సాధనల గురించి, భాషా గణిత సామర్థ్యాలు, పాఠశాలల సామాజిక తనిఖీలు గురించి ఉపాధ్యాయులకు వివస్తారని చెప్పారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయకుమారి, ప్రభాకర్, భాగ్యలక్ష్మి, ఉర్దూ పాఠశాలల కాంప్లెక్స్ సెక్రటరీ అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రైస్ కార్డులు అందజేత



మచిలీపట్నంటౌన్: 11వ డివిజన్‌లో పది మందికి మంజూరైన రైస్‌కార్డులను కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావు గురువారం అందజేశారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆదేశాలతో లబ్ధిదారులకు రైస్‌కార్డులు మంజూరయ్యాయని కార్పొరేటర్ నాగేశ్వరరావు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ రైస్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేస్తున్నారని చెప్పారు.

వైభవంగా స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠ



గూడూరు: గూడూరు మండలం పోసినవారిపాలెం శివారు కొత్తపాలెం అడ్డరోడ్డులో నిర్మించిన కోదండ రామాలయంలో స్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాతలు మచిలీపట్నం డిప్యూటీ మేయర్ శీలం భారతి, బాబ్జీ దంపతులు సీతారామ లక్ష్మణ హనుమంతుల విగ్రహాలను సమకూర్చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి కల్యాణం కనుల పండుగగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. పరసా నాగమల్లేశ్వరరావు, ఓలేటి ప్రసాద్, నాయుడు ప్రసాద్, పేరే జయరాజు దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ



మచిలీపట్నంటౌన్: 11వ డివిజన్‌లో పేద విద్యార్థులకు ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్కూల్ బ్యాగ్‌లను ఉచితంగా అందజేశారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ గూడవల్లి నాగరాజు వీటిని విద్యార్థులకు అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు ఆకూరి శ్వేత, వక్కంటి రమాదేవి 20 మంది విద్యార్థులకు వీటిని సమకూర్చారు. గూడవల్లి నాగరాజు మాట్లాడుతూ ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 11వ డివిజన్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్వేత, రమాదేవిని అభినందించారు.

పెడనలో కొత్తగా 249 పింఛన్లు మంజూరు

పెడన: పెడన మండలం, పట్టణంలో 249 మందికి కొత్తగా సామాజిక పింఛన్లు మంజూరయ్యాయి. మొదటి నెల మాత్రం స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా వీరు పింఛన్లు అందుకోనున్నారు. పెడన మండలంలో ఇప్పటి వరకు 5,554 మందికి పింఛన్లు అందజేస్తుండగా కొత్తగా 164 మందికి మంజూరయ్యాయి. అదేవిధంగా పట్టణంలో 4,461 మందికి ఇస్తుండగా కొత్తగా 85 మందికి మంజూరయ్యాయి. దీంతో పెడన మండలంలో (గ్రామీణ ప్రాంతంలో) 5,700కు చేరగా పట్టణంలో 4,546కు చేరాయి. పెడన మండల వ్యాప్తంగా మొత్తం 10,246 మందికి పింఛన్లు సెప్టెంబరు ఒకటి నుంచి ఐదో తేదీ వరకు పంపిణీ చేయనున్నారు. వీరికి సుమారు రూ.2.8 కోట్లకు పైగా నిధులు విడుదల చేశారు. ఒక్కొక్కరికి రూ.2,750 చొప్పున నగదును లబ్ధిదారులకు అందించనున్నారు.

మచిలీపట్నంలో 385 నూతన పింఛన్లు మంజూరు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో 385 నూతన పింఛన్లు మంజూరయ్యాయని కమిషనర్ జి. చంద్రయ్య గురువారం తెలిపారు. ఆగస్టు నెలలో మంజూరైన ఈ పింఛన్లను సెప్టెంబర్ నెలలో ప్రకటించే షెడ్యూల్ ప్రకారం ఎమ్మెల్యే పేర్ని నాని చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని చెప్పారు. నగరంలో ప్రస్తుతం 18,360 పింఛనుదారులు ఉన్నారని, నూతన పింఛన్లు 385 కలిపితే మొత్తం 18,745 పంపిణీ చేస్తారని చెప్పారు. నగరంలో ఇంకా 500 మంది పింఛనుదారుల వెరిఫికేషన్‌ను శుక్ర, శనివారాల్లో నిర్వహించి వారికి కూడా పింఛన్లు మంజూరు చేస్తామని చెప్పారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి వలంటీర్లు పాత పింఛనుదారులకు యథతథంగా పింఛన్ల పంపిణీ చేస్తారని వివరించారు.

గూడూరు మండలంలో..

గూడూరు: గూడూరు మండలానికి కొత్తగా 200 సామాజిక పెన్షన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. వితంతు పెన్షన్లు 77, వికలాంగ పెన్షన్లు 47, వృద్ధాప్య పెన్షన్లు 58, గీత కార్మికుల పెన్షన్లు 4, చేనేత కార్మికుల పెన్షన్లు 11, డీఎంహెచ్‌ఓ, ఒంటరి మహిళ, ఏబీహెచ్‌వై కేటగిరీలకు చెందిన ఒక్కొక్క పెన్షన్ మంజూరైందని వివరించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా పెన్షన్లు పంపిణీ చేస్తారని చెప్పారు.

హుస్సేన్‌కు ఏఎన్‌యూ పీహెచ్‌డీ



మజహర్ హుస్సేన్

బంటుమిల్లి: బంటుమిల్లికి చెందిన మహ్మద్ మజహర్ హుస్సేన్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా లభించింది. మజహర్ హుస్సేన్ ప్రాథమిక విద్యను బంటుమిల్లిలో పూర్తి చేశాడు. ఉన్నత విద్య అనంతరం సౌదీ అరేబియాలోని కింగ్ ఖాలీద్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మజహర్ హుస్సేన్ సౌదీలో ప్రొఫెసరుగా చేస్తూ ఆచార్య డాక్టర్ సీహెచ్ రవి పర్యవేక్షణలో సాఫ్ట్ కంప్యూటింగ్ ఆధారిత లోడ్ ఫ్రీక్వెన్సీ కంట్రోలర్ రూపకల్పన అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా లభించింది. ఈ పట్టాను యూనివర్సిటీ స్నాతకోత్సవంలో హుస్సేన్‌కు అందజేయనున్నారు. మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన హుస్సేన్ కష్టపడి చదువుకుని పలు ఇంజినీరింగ్ కాలేజీల్లో అధ్యాపకుడిగా పని చేస్తున్న సమయంలో విద్యుత్ శాఖలో ఉద్యోగం వచ్చింది. అధ్యాపక వృత్తిపై ఉన్న ఆసక్తితో అందులోనే స్థిరపడ్డాడు. ఉర్దూ టీచరుగా పనిచేసిన తల్లి అబ్బాస్‌బీ, సైన్స్ ఉపాధ్యాయుడిగా అన్న షౌకత్ హుస్సేన్‌ను ఆదర్శంగా తీసుకుని మజహర్ హుస్సేన్ కూడా అధ్యాపక వృత్తిలోనే ఉన్నాడు. పీహెచ్‌డీకి ఎంపికైన హుస్సేన్‌ను కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

రంగన్నగూడెం దాడి ఘటనపై ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు



ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రంగన్నగూడెంలో దళితులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన టీడీపీ నాయకులను తక్షణమే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌కు పలువురు దళిత సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నంలోని ఆయన కార్యాలయంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం కలిసి రంగన్నగూడెం దాడి ఘటనపై ఫిర్యాదు అందజేశారు. దాడి చేసిన టీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితులను అరెస్ట్ చేయకుండా తాత్సారం చేయటాన్ని తప్పుబట్టారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మెండెం రాంబాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఐనంపూడి ఆశీర్వాదం, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, లీగల్ సెల్ సభ్యుడు అరిగెల రాజా ఉన్నారు. అంతకుముందు రంగన్నగూడెంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో రెండోరోజు దీక్ష నిర్వహించారు.

చట్టాలపై అవగాహన అవసరం

న్యాయమూర్తి రామకృష్ణయ్య



మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): బాలబాలికలు, విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. నోబుల్ కళాశాల సమీపంలోని కళాశాల విద్యార్థుల వసతిగృహంలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు ఉన్న బాలబాలికలపై లైంగిక వేధింపులు, దాడులు నియంత్రించేందుకు పోక్సో చట్టం తీసుకువచ్చారని చెప్పారు. బాలబాలికలు ఏదైనా ఘటన జరిగితే కుటుంబ సభ్యుల ద్వారా పోలీసులకు గాని, న్యాయస్థానానికి గాని సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి రక్షణ కల్పిస్తామన్నారు. ఆపద కాలంలో దిశ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే సత్వరమే రక్షణ కల్పిస్తారని చెప్పారు. లైంగిక వేధింపులు, దాడులకు గురిచేసిన వారికి కఠినమైన శిక్షలు విధిస్తామన్నారు. సదస్సులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య, న్యాయవాది ఎస్ గోవర్ధనమ్మ, వార్డెన్ ఎన్. నటరాజరామ్, దిశ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ఆర్. సుశీల తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలులో...

నెలవారీ పరిశీలనలో భాగంగా స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య గురువారం పరిశీలించారు. సబ్ జైలులో ఖైదీలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. జైలులో మాదకద్రవ్యాల విక్రయాలపై పట్టుబడిన ఖైదీలు ఎక్కువగా ఉండటంతో వారికి న్యాయమూర్తి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ పి. రమేష్ పాల్గొన్నారు.

స్టీల్ ప్లేట్ల వితరణ



గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం పూర్వ విద్యార్థులు భోజనం ప్లేట్లు, సాంబార్లు బకెట్లను అందజేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో పాఠశాలలో 1981–82 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు 200 భోజనం ప్లేట్లు, 5 సాంబారు బకెట్లను జి.రమణబాబు, పి.వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని ఎస్.పద్మజాదేవి, ఉపాధ్యాయులు వి.విజయలక్ష్మీ, పి.ప్రసాద్, గూడూరు సీహెచ్‌సీ డైరెక్టర్ ఎంఏ సలీమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

కంకిపాడు: మెరుగైన విద్యుత్ సరఫరాకు సమర్థంగా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఈఈ(ఆపరేషన్స్) పి.హరిబాబు అన్నారు. మండలంలోని మద్దూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో రూ.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి ప్రారంభించారు. హరిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొంటున్న లో ఓల్టేజీ సమస్య పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పరిష్కారమవుతుందన్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ(ట్రాన్స్‌ఫార్మర్స్) రవికిషోర్, డీఈఈ ఎం.పూర్ణచంద్రరావు, ఏఈఈ టి.అశోక్‌కుమార్, మద్దూరు సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ సభ్యుడు వడుగు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానంపై ర్యాలీ

కంకిపాడు: నేత్రదానం సామాజిక కర్తవ్యమని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో జాతీయ నేత్రదాన వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి నేత్రదాన ప్రాముఖ్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. డాక్టర్ సుందర్‌కుమార్ మాట్లాడుతూ.. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక మనిషి తన కళ్లను దానం చేయటం ద్వారా ఇద్దరికి చూపు లభిస్తుందని చెప్పారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓ కృష్ణారావు, హెల్త్ సూపర్‌వైజర్ సారమ్మ, హెల్త్ అసిస్టెంట్ కెనడీ బాబు, ఏఎన్‌ఎం భవాని, ఎఫ్‌ఎన్‌ఓ సాజిద, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం వరప్రసాద్ పాల్గొన్నారు.

సాంకేతికతకు అనుగుణంగా విద్యా బోధన

రామవరప్పాడు: మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతికతకు అనుగుణంగా విద్యా బోధన చేయాలని ఎస్‌ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు అధ్యాపకులకు సూచించారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్‌ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'నేషనల్ ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం'పై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులను పరిపూర్ణులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. అధ్యాపకులు కూడా నిరంతర విద్యార్థులేనని, ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా తమను తాము మార్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని చెప్పారు. రిసోర్స్ పర్సన్‌గా హాజరైన క్లౌడ్ డెవలప్స్ ఇంజినీర్ ఎం. రమేష్ నిరంతర అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కార్యకలాపాలు, కాన్ఫిగరేషన్ మేనేజ్‌మెంట్, ఆటోమేషన్ అంశాలపై అవగాహన కల్పించారు. ఏడబ్ల్యూఎస్ ఈసీ2 సర్వీస్, బేసిక్ కమాండ్స్, గిట్ యుజెస్, జెన్‌కిన్ ఫ్రీ స్టయిల్ ప్రాజెక్ట్, పైప్‌లైన్ ప్రాజెక్టు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి బి.ఆశాలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

నున్న జెడ్పీ హైస్కూల్‌లో వసతుల పరిశీలన



నున్న హైస్కూల్ ను సందర్శించిన ఎన్‌ఐడీఎం బృందం

నున్న(విజయవాడరూరల్): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐడీఎం) బృందం గురువారం నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించింది. కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు మహిళా పోలీసుల(మహిళా సంరక్షణ కార్యదర్శులకు) శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్కూల్ సేఫ్టీ అనే అంశంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి 60 మంది శిక్షకులు ఉన్నారు. 9,10 తరగతుల విద్యార్థులను వారు కలిసి అక్కడ వున్న మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పర్యావరణ పరిరక్షణ, తాగునీరు, శానిటేషన్, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల మానసిక స్థితిగతులను వారు పరిశీలించారు. తరగతి గదుల సేఫ్టీని పరిశీలించారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ లో మౌలిక సదుపాయాలను పరిశీలించిన బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ బృందంలో క్యాంపస్ మేనేజర్ బీరేంద్రసింగ్, సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కుమార్ రాకా, జూనియర్ కన్సల్‌టెంట్ నజియా, డాక్టర్ బాలు.ఐ, రంజన్‌కుమార్, షాహీన అన్సారీ తదితరులున్నారు. హైస్కూల్‌కు సంబంధించిన వివరాలను హెచ్‌ఎం భూపాల్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.